జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

గురువారం 03-09-2026

సంపుటి 1 సంచిక 282

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195




## రూ.2,800 తగ్గిన బంగారం

4లో



### గ్లోబల్ సమ్మిట్-2026కు రాజ్‌నాథ్‌కు

# సీఎం రేవంత్ ఆహ్వానం

### రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి

### దేవరకద్రలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమి కేటాయింపు

**దశ, ఢిల్లీ:** తెలంగాణలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయిన సీఎం.. ఎయిర్‌షో, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల సదస్సులు, రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలతో పాటు వైమానిక దళ విమానాల ప్రదర్శనకు సహకరించాలని కోరారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, డీఆర్‌డీవో వంటి సంస్థలు విస్తృతంగా పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు టీజీఐఐసీ అంగీకరించినట్లు సీఎం తెలిపారు. 33 ఏళ్లకు మొత్తం భూమికి ఏడాదికి కేవలం రూ.1 నామమాత్రపు లీజుతో కేటాయించనున్నట్లు వెల్లడించారు. అవసరమైతే మరో రెండుసార్లు లీజు పొడిగించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి అవసరమైన 1,500 ఎకరాల్లో ఇప్పటికే 750 ఎకరాలు సేకరించామని, మరో 750 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రికి తెలిపారు.

### వెయ్యి రోజుల పాలన కాదు..

# కాంగ్రెస్ ప్రజా పీడన

### కాంగ్రెస్ పాలనపై కదం తొక్కిన బీఆర్ఎస్.. ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో

### హామీల మోసాన్ని ఎండగడుతూ.. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ సమరభేరి

### 420 అడుగుల కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన





దశ, రంగారెడ్డి ప్రతినిధి : : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో భారీ నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో

..మిగతా 4వ పేజీలో →



# జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ

### వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాలు మాయం.. వరుసగా మూడు ఇళ్లలోకి చొరబడేందుకు యత్నం.

**దశ, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో వరుస చోరీయత్నాలు కలకలం రేపాయి. రోడ్ నంబర్ 10 పరిధిలో ఓ అగంతకుడు పక్కపక్కనే ఉన్న మూడు ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. ఓ ఇంట్లో యజమాని నిద్రలేవడంతో పరారైన దుండగుడు.. మరో వ్యాపారి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ప్లాట్ నంబర్ 147లో వ్యాపారి శైలేందర్‌సింగ్ ఇంట్లోకి ప్రవేశించిన అగంతకుడు.. కప్‌బోర్డులో ఉన్న విలువైన వజ్ర, బంగారు ఆభరణాలను అపహరించాడు. ఎమరాల్డ్ వజ్రపు ఉంగరం, రెండు బ్రాస్లెట్లు, నెక్లెస్, చెవి కమ్మలు, ఎమరాల్డ్ నెక్లెస్, మరో బంగారు నెక్లెస్ సహా మరికొన్ని ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఉదయం శైలేందర్‌సింగ్ భార్య నీలూ కౌర్ చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నారు. మరోవైపు ప్లాట్ నంబర్ 154లోని వ్యాపారి శీతల్ బాంగర్ ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

### బడా వినాయకులకు

# భారీ ధరలు

### గతేడాదితో పోలిస్తే విగ్రహాల ధరలు 25 శాతం వరకు పెరుగుదల

4లో




### కాంగ్రెస్ పాలనపై

# కేటీఆర్ ఛార్జ్‌షీట్.. విమర్శలు

### "వెయ్యి రోజుల్లో రాష్ట్ర సంపద కోసం మంత్రులు, సీఎం తన్నుకున్నారు"

### "అసమర్థత Pro Max.. అవినీతి Ultra Max.. అరాచకం IMAX".

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల చేసిన ఆయన.. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, రైతు సమస్యలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనను GenZ భాషలో చెప్పాలంటే "అసమర్థత Pro Max.. అవినీతి Ultra Max.. అరాచకం IMAX" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో స్వర్గం చూపిస్తామని చెప్పి వెయ్యి రోజులు నరకం చూపించారని విమర్శించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండానే రాష్ట్రాన్ని రూ.4.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని ఆరోపించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని, 70 శాతం మంది రైతులను మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.

#### చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు

ఏపీ సీఎం చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి చెంచాగిరి చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.మిస్ వరల్డ్, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. రైతులకు నీళ్లు ఇవ్వడానికి మాత్రం

..మిగతా 4వ పేజీలో →




# డిసెంబరులో కార్పొరేషన్ ఎన్నికలు?

### జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరితో పాటు వాయిదా పడిన పురపాలక సంస్థలకు ఎన్నికలు

#### అక్టోబర్ 19 తర్వాత షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డిసెంబరు నెలలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు ఎన్నికలు వాయిదా పడిన ఇతర పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పురపాలక శాఖ అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించారు. అయితే అప్పటికి జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీకాలం పూర్తికాకపోవడంతో వాటికి ఎన్నికలు జరగలేదు. మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా వివిధ కారణాలతో ఎన్నికలు

..మిగతా 4వ పేజీలో →



### మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై

# హైకోర్టులో పిటిషన్లు

### డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా చేస్తారన్న పిటిషనర్ల తరపు న్యాయవాదులు

**దశ, హైదరాబాద్:** మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై తాజాగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మూసీ ప్రాజెక్టు పేరుతో హిమాయత్‌సాగర్ పరిధిలోని తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు కె.వివేక్‌రెడ్డి, కె.ప్రతీక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పిటిషనర్ల భూములను స్వాధీనం చేసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది.



# 2,800 తగ్గిన బంగారం ధర

**దశ, హైదరాబాద్:** బంగారం ధరలు భారీగా తగ్గాయి. మంగళవారం 10గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,56,930 ఉండగా.. బుధవారం రూ.1,54,080కి చేరింది. ఒక్కరోజులోనే రూ.2,850 తగ్గింది. వెండి ధర కూడా కిలోకు రూ.2,60,000 నుంచి రూ.2,49,900కి పడిపోయింది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,41,240గా ఉంది.

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఛార్జ్‌షీట్.. విమర్శలు

మొదటి పేజీ తరువాయి

డబ్బులు లేవంటోందని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి.. ''జాబ్‌లెస్ క్యాలెండర్'' విడుదల చేశారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో సచివాలయ ఉద్యోగుల నిరసనలు కూడా ప్రభుత్వ పాలనా తీరుకు నిదర్శనమని అన్నారు.

# డిసెంబరులో కార్పొరేషన్ ఎన్నికలు?

మొదటి పేజీ తరువాయి

వాయిదా పడ్డాయి. జీహెచ్ఎంసీ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగిసిన అనంతరం ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలను కలుపుతూ మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. కొత్త కార్పొరేషన్ల పరిధులు, వార్డుల పునర్వ్యవస్థీకరణ తదితర ప్రక్రియల కారణంగా ఎన్నికలకు కొంత ఆలస్యం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతుండటంతో అధికారులు దానిపైనే ప్రధానంగా దృష్టి సారించారు. అక్టోబర్ 19 నాటికి ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ తర్వాత ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిసెంబరులో ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నప్పటికీ.. వాతావరణ పరిస్థితులు, పరిపాలనా సన్నద్ధత, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల ఎన్నికల షెడ్యూల్‌పై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికల



# కాంగ్రెస్ ప్రజా పీడన

మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. 'ఇది 1000 రోజుల ప్రభుత్వ పాలన కాదు.. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడన' అంటూ నినదించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కారణంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా నాయకులు ప్రస్తావించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ, హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# ఆయిల్‌పామ్‌కు డబుల్ బొనాంజా

## రికార్డు స్థాయికి గెలల ధర.. ఆగస్టులో రైతులకు రూ.175 కోట్ల చెల్లింపులు

**దశ, ఖమ్మం :** ఆయిల్‌పామ్ రైతులకు డబుల్ బొనాంజా లభించింది. ఒకవైపు గెలల ధర రికార్డు స్థాయికి చేరగా.. మరోవైపు రైతులకు భారీగా చెల్లింపులు జరిగాయి. టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.24,025కు చేరింది. దేశంలో ఆయిల్‌పామ్ సాగు చరిత్రలో ఇదే అత్యధిక ధర అని అధికారులు తెలిపారు. జూలైలో టన్ను గెలలకు రూ.23,783 ధర ఉండగా.. ఆగస్టు చివరి నాటికి మరో రూ.242 పెరిగి రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పామాయిల్ ధరలు, ఉత్పత్తి పరిస్థితుల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటాయని అధికారులు తెలిపారు. మరోవైపు ఆగస్టు నెలలో ఆయిల్‌పామ్ రైతులకు సుమారు రూ.175 కోట్లను చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని చెల్లించడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారని పేర్కొన్నారు. రికార్డు ధరతో పాటు భారీ చెల్లింపులు రైతులకు ఊరటనిస్తున్నాయి. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, నీటి నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో గెలలకు మెరుగైన ధర లభించడం రైతులకు ప్రయోజనకరంగా మారింది. ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. రికార్డు ధరపై ఆయిల్‌పామ్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బడా వినాయకులకు భారీ ధరలు

**గతేడాదితో పోలిస్తే విగ్రహాల ధరలు 25 శాతం వరకు పెరుగుదల**



**దశ, హైదరాబాద్ :** వినాయక చవితి సమీపిస్తుండటంతో భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాల సందడి మొదలైంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల తయారీ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అయితే ఈ ఏడాది విగ్రహాల ధరలు భారీగా పెరగడంతో భక్తులు, ఉత్సవ కమిటీలపై అదనపు భారం పడనుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కొబ్బరిపీచు, రంగులు, అలంకరణ సామగ్రి ధరలతో పాటు రవాణా ఖర్చులు పెరగడంతో విగ్రహాల ధరలు గతేడాదితో పోలిస్తే సుమారు 25 శాతం వరకు పెరిగాయి. గతేడాది 20 అడుగుల విగ్రహం రూ.85 వేల వరకు ఉండగా.. ఈసారి రూ.లక్ష దాటింది. 12 నుంచి 16 అడుగుల విగ్రహాల ధరలు రూ.5060 వేల నుంచి రూ.7080 వేలకు చేరాయి. ధూల్‌పేట్, నాగోలు, ఎల్బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ధూల్‌పేట్ విగ్రహాలకు ఇతర రాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది. డిజైన్లు, ఫైబర్ హంగులు, అలంకరణలను బట్టి 20 నుంచి 30 అడుగుల భారీ విగ్రహాల ధరలు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతున్నాయి. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై హైకోర్టులో పిటిషన్లు. డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా చేస్తారన్న పిటిషనర్ల తరఫు న్యాయవాదులు. దశ, హైదరాబాద్ : మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై తాజాగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మూసీ ప్రాజెక్టు పేరుతో హిమాయత్‌సాగర్ పరిధిలోని తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు కె.వివేక్‌రెడ్డి, కె.ప్రతీక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పిటిషనర్ల భూములను స్వాధీనం చేసుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# రేవంత్‌పై చర్యలు తీసుకోకుండా నాపై ఎందుకు?: కొండా సురేఖ



**దశ, న్యూఢిల్లీ :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నేతలతో భేటీ అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనపై చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారని అన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేసి చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. కేసీ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ దొరకలేదని, మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చానని తెలిపారు. తనపై చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని ప్రశ్నించారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్‌గాంధీ చెబుతున్నారని, తన కుమార్తె మాట్లాడిన విషయానికి తనపై చర్యలు తీసుకోవద్దని సురేఖ అన్నారు. పొంగులేటి, భట్టి భార్యల కమిషన్లకు సంబంధించి కూడా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చాలామంది రెడ్లు మాట్లాడినప్పటికీ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మంత్రి కొండా సురేఖ నిలదీశారు.

# ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

**దశ, న్యూఢిల్లీ :** తెలంగాణలో ఆదిలాబాద్, మామునూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును కోరారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమయ్యారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని సీఎం తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్‌తో పాటు ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. రన్‌వే తుది నిర్ణయానికి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మామునూరు విమానాశ్రయానికి రెండు వారాల్లో టెండర్లు పిలిచి, డిసెంబర్ నాటికి ఖరారు చేసి అదే నెలలో పనులకు శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని సీఎం కోరారు. హుస్సేన్‌సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్‌ను కబ్జా చేయాలని చూస్తే ఊరుకోను

**దశ, నల్గొండ:** వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని, వైఎస్సార్ ఆశయాల కోసం పనిచేస్తానని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము వైఎస్సార్ శిష్యులమని, ఆయనను ఎప్పటికీ మరవబోమని అన్నారు. కొందరు ముఖ్యమంత్రి పదవి గురించి మాట్లాడుతున్నారని, సమయం వచ్చినప్పుడు బ్రహ్మదేవుడు కూడా ఆపలేరంటూ వ్యాఖ్యానించారు. కొత్తగా పార్టీలోకి వచ్చినవారు కాంగ్రెస్ పార్టీని కబ్జా చేయాలని చూస్తే తాను ఊరుకోనని స్పష్టం చేశారు. కొంతమంది కాంగ్రెస్‌ను కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తానని, వైఎస్సార్ రాజ్యాన్ని మళ్లీ తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగదని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

# వంద గజాల్లో ఆరు అంతస్తులు!

## హైదరాబాద్ చుట్టూ అక్రమ కాంక్రీట్ వనాలు.. నిబంధనలు గాలికి

## సెట్‌బ్యాక్ లేదు.. పార్కింగ్ లేదు.. ఫైర్ సేఫ్టీపై అనుమానాలు

## అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా? అధికారుల పై ప్రశ్నలు



**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరం చుట్టూ అక్రమ నిర్మాణాల విస్తరణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్ నుంచి పాతబస్తీ, మల్కాజిగిరి, ఉప్పల్ వరకు పలు ప్రాంతాల్లో చిన్నచిన్న ప్లాట్లపై భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం 60 నుంచి 100 చదరపు గజాల స్థలంలోనే ఐదు, ఆరు అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని చోట్ల అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. చిన్న స్థలంలో ఎత్తైన భవనాలు నిర్మించడంతో సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, అగ్నిమాపక భద్రత, అత్యవసర ప్రవేశ మార్గాలు వంటి అంశాలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో వాహనాలు రోడ్లపైనే నిలపాల్సి వస్తోందని, ఇరుకైన గల్లీల్లో అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చౌకగా వస్తున్నాయనే ఆశతో కొనుగోళ్లు

నగర శివారు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఇలాంటి భవనాల్లో ఫ్లాట్లు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తుండటంతో మధ్యతరగతి ప్రజలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే కొనుగోలు చేసే ముందు భవనానికి సంబంధించిన అనుమతులు, నిర్మాణ నిబంధనలు, ఆక్యుపెన్సీ, ఫైర్ సేఫ్టీ, స్ట్రక్చరల్ స్టెబిలిటీ తదితర అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల్లో భద్రతా ప్రమాణాలు లోపిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్న ఆందోళనలు ఉన్నాయి. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు, భూకంపాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి నిర్మాణాల పరిస్థితి ఎలా ఉంటుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### హైడ్రా ఏం చేస్తుంది?

చెరువులు, నాలాలు, బఫర్‌జోన్ల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్న హైడ్రా.. నగర గల్లీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనాల విషయంలోనూ ఇదే స్థాయిలో దృష్టి సారిస్తుందా? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చకు వస్తోంది. అయితే ఇప్పటికే పూర్తయిన ఇలాంటి భవనాలను పెద్ద సంఖ్యలో కూల్చివేయడం వల్ల ఇళ్ల యజమానులు, కొనుగోలుదారులు, అద్దెదారులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ప్రతి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడమే పరిష్కారం కాకుండా, భవన భద్రతను నిర్ధారించడం, నిబంధనలను అమలు చేయడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### స్ట్రక్చరల్ ఆడిట్ తప్పనిసరి చేయాలి

చిన్న ప్లాట్లలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలకు దశలవారీగా స్ట్రక్చరల్ స్టెబిలిటీ ఆడిట్ నిర్వహించాలని సూచనలు వస్తున్నాయి. నిర్మాణం ప్రమాదకరంగా ఉన్నట్లు తేలిన భవనాలకు నోటీసులు జారీ చేసి అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే ఖాళీ చేయించే చర్యలు చేపట్టవచ్చు. అనుమతులకు మించి నిర్మించిన అంతస్తులపై చట్టబద్ధమైన భారీ జరిమానాలు విధించడం, అదనపు పన్నులు విధించడం, అక్రమ నిర్మాణాలకు పాల్పడే బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు కూడా అక్రమ నిర్మాణాలను నిరుత్సాహపరచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### పునాది దశలోనే అడ్డుకట్ట వేయాలి

అయితే అసలు ప్రశ్న "100 గజాల స్థలంలో ఆరు అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు ఎందుకు గుర్తించలేకపోతున్నారు?" అన్నదే. నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసి ఆ తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. పునాది దశలోనే నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను గుర్తించి నిలిపివేయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినట్లు తేలితే సంబంధిత అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ అనుమతుల పర్యవేక్షణ, క్షేత్రస్థాయి తనిఖీలు, నిర్మాణ దశల వారీ తనిఖీలు, స్ట్రక్చరల్ ఆడిట్లు, కఠినమైన జరిమానాలతో పాటు నిబంధనలు ఉల్లంఘించే బిల్డర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. చెరువులు, నాలాలను కాపాడటం ఎంత ముఖ్యమో.. నగర గల్లీల్లో భద్రతా ప్రమాణాలు లేకుండా పెరుగుతున్న కాంక్రీట్ నిర్మాణాలను నియంత్రించడం కూడా అంతే ముఖ్యం. లేదంటే చిన్న ప్లాట్లపై పెరుగుతున్న ఈ భారీ నిర్మాణాలు భవిష్యత్తులో హైదరాబాద్ మౌలిక వసతులకు, ప్రజల భద్రతకు పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com